క్లుప్తంగా

మజ్జిగ పంపిణీ

కంబాలచెరువు: కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ డిగ్రీ మహిళా కళాశాల ఆంగ్ల విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమాన్ని ప్రారంభించిన ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రాఘవ కుమారి మాట్లాడుతూ యుఎస్ నేషనల్ ఓషియానిక్ అండ్ స్పియరిక్ అడ్మినిస్ట్రేషన్ అధ్యయనం ప్రకారం దశాబ్దానికి సగటున 0.17 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత పెరుగుతోందన్నారు. కార్యక్రమంలో ఆంగ్ల విభాగాధిపతి డాక్టర్ బి.అనురాధ సూర్యకుమారి, పీఎస్ఎస్ఎన్.దుర్గాప్రసాద్, కె.చిన్నిబాబు, జేఆర్ ఠాగూర్, బి.జానకి పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ జిల్లా కార్యవర్గం ఎన్నిక



ఏపీటీఎఫ్ జిల్లా కార్యవర్గ సభ్యులు

కంబాలచెరువు: ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) జిల్లా నూతన కార్యవర్గ ఎన్నిక శుక్రవారం స్థానిక నెహ్రూనగర్ ఉన్నత పాఠశాలలో జరిగింది. జిల్లా అధ్యక్షుడిగా డేవిడ్ లివింగ్స్టన్, గౌరవాధ్యక్షుడిగా వరుుల అప్పయ్య శాస్త్రి, ప్రధాన కార్యదర్శిగా కేవీవీ సత్యనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులుగా కృష్ణా జిల్లా ప్రధాన కార్యదర్శి తుమ్మ నాగరాజు, ఏలూరు జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కృష్ణ వ్యవహరించారు. అనంతరం జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. వివిధ మండలాల నుంచి వచ్చిన కార్యదర్శులు నివేదికను అందజేశారు. ఈ నెల 27న జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి వైఆర్‌కే ప్రసాద్ వర్ధంతి జరపాలని తీర్మానించారు.

కరాటే పోటీలకు ఆర్ట్స్ కళాశాల విద్యార్థి



నాగపండుకు చెక్కు అందజేస్తున్న ప్రిన్సిపాల్ రామచంద్రరావు

ప్రకాశం నగర్: ఇండో నేపాల్ కరాటే చాంపియన్‌షిప్ 2024 పోటీలకు ప్రభుత్వ అటానమస్ కళాశాల విద్యార్థి బి.నాగపండు ఎంపికయ్యాడు. మే 21 నుంచి 25 వరకూ ఈ పోటీలు జరుగుతాయని ప్రిన్సిపాల్ ఆర్‌కే రామచంద్రరావు శుక్రవారం తెలిపారు. నాగపండుకు ఖర్చుల కోసం కళాశాల తరఫున రూ.37 వేల ఆర్థిక సాయం అందజేశారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ విద్యార్థుల ఉన్నత లక్ష్యాలను ప్రోత్సహించడానికి కళాశాల ఎప్పుడూ ముందంజలో ఉంటుందన్నారు. నాగపండు ఇప్పటికే 30 బంగారు పతకాలు, నోబెల్ ప్రపంచ రికార్డు, బ్లాక్ బెల్ట్ సాధించాడన్నారు. కార్యక్రమలో కళాశాల అసిస్టెంట్ ప్రిన్సిపాల్ జి.చంద్రశేఖర్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సీహెచ్ ఆదిమహేంద్ర, ఫిజికల్ ఎడ్యుకేషన్ సమన్వయకర్త ఎం.ప్రసాద్, పీడీ విజయ్ తదితరులు అభినందించారు.

410 లీటర్ల సారా స్వాధీనం



సారా, నిందితుడితో ఇన్‌స్పెక్టర్ హనుశ్రీ

రాజమహేంద్రవరం రూరల్: సౌత్ స్టేషన్ పరిధిలో సెబ్ అధికారులు శుక్రవారం విస్తృత దాడులు నిర్వహించారు. ఇన్‌స్పెక్టర్ పి.హనుశ్రీ మాట్లాడుతూ దాడుల సందర్భంగా మూడు కేసులు నమోదు చేసి, 410 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని, 4400 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశామన్నారు. రాజానగరం మండలం సూర్యారావుపేటకు చెందిన మార్గాని చింతలయ్య ప్రసాద్, రాధేయపాలేనికి చెందిన గిసాల సురేష్, గోకవరం మండలం పెంటకోట గ్రామానికి చెందిన లంజపల్లి శ్రీనులను అదుపులోకి తీసుకున్నామన్నారు. రాజమహేంద్రవరం రూరల్ మండలం పిడింగొయ్యికి చెందిన ఎర్ర మణికంఠ, రాజానగరం మండలం రఘునాథపురానికి చెందిన కటకం ఏసు పరారీలో ఉన్నారన్నారు.

చెత్త కుప్పలా రైల్వేస్టేషన్



ప్లాట్‌ఫాం వెంబడి పేరుకుపోయిన చెత్త

రాజమహేంద్రవరం సిటీ: పారిశుధ్య కార్మికులు విధులు బహిష్కరించడంతో ప్రధాన రైల్వే స్టేషన్ ఆవరణ చెత్తకుప్పలా మారింది. స్టేషన్‌లో 23 మంది అవుట్ సోర్సింగ్ కార్మికులు విధులు నిర్వహిస్తున్నారు. వారికి ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్ నెలల జీతాలను చెల్లించలేదు. దీంతో మే ఒకటి నుంచి కార్మికులు విధులను బహిష్కరించారు. దీంతో చెత్త ఎక్కడికక్కడ పేరుకుపోయింది. వ్యర్థాల నుంచి దుర్వాసన వెలువడుతోంది.

పాఠశాలలకు కొత్తరూపు

- నాడు– నేడుతో అభివృద్ధి పనులు
- కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా వసతులు



నాడు - నేడుతో అభివృద్ధి చెందిన పంతం సత్యనారాయణ మున్సిపల్ స్కూల్



తుమ్మలావ మున్సిపల్ స్కూల్

కంబాలచెరువు: రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన మన బడి నాడు – నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశ పట్టింది. దాని ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించారు. కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్ది పూర్తి డిజిటల్ విధానంలో మార్చేశారు. ప్రభుత్వం చేపడుతున్న విద్యారంగ సంస్కరణల్లో భాగంగా మన బడి నాడు – నేడు పథకంలో రాజమహేంద్రవరం డివిజన్‌లోని ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారిపోయాయి. కార్పొరేట్లను తలదన్నేలా ప్రభుత్వ స్కూళ్లు మారాయి. నాడు – నేడు కార్యక్రమం ప్రారంభ దశలో నగరంలో 16 పాఠశాలలను సుందరంగా తీర్చిదిద్దారు.

రెండు ఫేజ్‌లలో అభివృద్ధి

మన బడి నాడు – నేడు కార్యక్రమం ఫేజ్ 1లో భాగంగా రాజమహేంద్రవరంలోని 15 సెకండరీ స్కూళ్లు, 19 ప్రైమరీ స్కూళ్లు, 3 అప్పర్ ప్రైమరీ స్కూళ్లు మొత్తం 37 పాఠశాలల రూపురేఖలు మారిపోయాయి. వీటి అభివృద్ధి పనులకు రూ.11.32 కోట్లు ఖర్చు చేశారు. ఇక ఫేజ్ – 2లో 45 ప్రైమరీ, 15 హైస్కూళ్లను అభివృద్ధి చేశారు. (వీటితో పాటు 15 అంగన్‌వాడీ కేంద్రాలు అదనంగా ఉన్నాయి). ఈ పనులకు రూ.16.85 కోట్లు ఖర్చు చేశారు. రాజమహేంద్రవరం డివిజన్‌లో ఫేజ్ 1, 2 లలో మొత్తం రూ.28.15 కోట్లతో ప్రభుత్వ స్కూళ్లకు కొత్త రూపు తీసుకురావడమే, కాకుండా విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు సమకూర్చారు. నాడు – నేడు కార్యక్రమాన్ని దశల వారీగా విద్యాశాఖాధికారులు పూర్తి చేశారు.

తొమ్మిది అంశాలకు ప్రాధాన్యం

నాడు – నేడులో అభివృద్ధి చేయాల్సిన స్కూళ్లను, వాటి పరిస్థితిని స్థానిక విద్యాశాఖాధికారులు ముందుగానే గుర్తించారు. ముఖ్యంగా తొమ్మిది అంశాలపై ఫోకస్ చేశారు. విద్యుత్ సౌకర్యం, ఫ్యాన్లు, విద్యార్థులకు అవసరమయ్యే ఫర్నిచర్, మరమ్మతులు, బ్లాక్ బోర్డులు, అదనపు తరగతి గదులు, ప్రహరీ నిర్మాణం, ట్యూబ్ లైట్లు వంటి వాటిని ఫొటోలు, వీడియో ద్వారా చిత్రీకరించి ఆ రిపోర్టును ప్రభుత్వానికి నివేదించారు. ఈ తొమ్మిది అంశాలతో పాఠశాలలను అభివృద్ధి చేసి కార్పొరేట్‌కు దీటుగా మార్చారు.

అన్ని వసతులు

రాజమహేంద్రవరంలో అన్ని ప్రభుత్వ పాఠశాలలను ఎంతో అభివృద్ధి చేశారు. ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో సకల సౌకర్యాలూ కల్పించారు. తరగతి గదులను అత్యద్భుతంగా తీర్చిదిద్దారు. డెస్కులు, ఫ్యాన్లు, బెంచీలతో పాటు మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యాలను కల్పించారు. కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు తయారయ్యాయి. పిల్లలకు బ్యాగులు, పుస్తకాలు, షూస్, సాక్సులను ప్రభుత్వం అందజేసింది.

– బి.పద్మలత, విద్యార్థి తల్లి, రాజమహేంద్రవరం

అక్రమ మద్యం నిల్వలపై దాడులు



సిబ్బందికి సూచనలు చేస్తున్న సెబ్ డిప్యూటీ కమిషనర్ శంకరయ్య

రాజమహేంద్రవరం రూరల్: అక్రమ మద్యం నిల్వలపై దృష్టి సారించి, దాడులు నిర్వహించాలని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో విజయవాడ డిప్యూటీ కమిషనర్ ఎం.శంకరయ్య ఆదేశించారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో సెబ్ నార్త్‌స్టేషన్‌ను శుక్రవారం సాయంత్రం ఆయన సందర్శించారు. రికార్డులను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. జిల్లా సెబ్ ఆఫీసర్ పిట్టా సోమశేఖర్ మాట్లాడుతూ ఎన్‌డీపీఎల్, డీపీఎల్‌లను పాడుపడిన గృహాలు, రైసుమిల్లులు, ఇటుకబట్టీలు, గడ్డివాములలో అక్రమంగా నిల్వ ఉంచుతున్నారని సమాచారం మేరకు, వాటి ఆచూకీ తెలుసుకుని వాటిపై దాడులు నిర్వహించాలన్నారు. సమావేశంలో అసిస్టెంట్ స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ జయమౌనిక, రాజమహేంద్రవరం సెబ్‌నార్త్ ఇన్‌స్పెక్టర్ డాక్టర్ ఎస్.నిక్సన్, డీటీఎఫ్ ఇన్‌స్పెక్టర్ టి.గోపాలకృష్ణ, సెబ్ నార్త్‌స్టేషన్ ఎస్సై ఎంఎస్ఎన్ శాస్త్రి, సిబ్బంది పాల్గొన్నారు.

జగన్ సహకారంతోనే నగరాభివృద్ధి



బ్యాలెట్ నమూనాతో ప్రచారం చేస్తున్న ఎంపీ భరత్‌రామ్

- ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థి భరత్‌రామ్
- 34, 36, 40 డివిజన్లలో ఎన్నికల ప్రచారం

రాజమహేంద్రవరం సిటీ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంపూర్ణ సహకారంతోనే నగరాన్ని అభివృద్ధి చేయగలిగానని ఎంపీ, వైఎస్సార్ సీపీ సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి మార్గాని భరత్ రామ్ తెలిపారు. స్థానిక 34, 36, 40 డివిజన్లలో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. 34వ డివిజన్ పార్టీ ఇన్‌చార్జి పోలు విజయలక్ష్మి, 40వ డివిజన్ ఇన్‌చార్జ్ బత్తిన అన్నవరం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఎంపీ భరత్‌రామ్ మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల సంక్షేమంతోనే సమ సమాజ స్థాపన సాధ్యమని జగనన్న నమ్మారన్నారు. అంబేడ్కర్ భావజాలంతో, మహాత్మాగాంధీ కలలు కన్న గ్రామ సుపరిపాలనకు నడుం కట్టారన్నారు. గ్రామ స్వరాజ్యంతోనే రాష్ట్ర అభివృద్ధి తద్వారా దేశాభివృద్ధి సాధ్యమన్నారు. పేదల రహిత రాష్ట్రంగా ఏపీని తీర్చిదిద్ది, దేశంలో ఆదర్శంగా నిలపడం జగన్ ఆశయమన్నారు. తాను ఎంపీగా నగరాన్ని అద్భుతంగా తీర్చిదిద్దానని, ఎమ్మెల్యేగా ఆశీర్వదిస్తే విశ్వనగరంగా అభివృద్ధి చేస్తానన్నారు.

ఉచిత ప్రయాణంపై ఆటో కార్మికుల నిరసన



ఆటో కార్మికుల ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎంపీ భరత్‌రామ్

రాజమహేంద్రవరం సిటీ: టీడీపీ మేనిఫెస్టోలో ప్రకటించిన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం హామీపై ఆటోకార్మికులు నిరసన తెలిపారు. దాని వల్ల తమ జీవనోపాధి పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం మాజీ కార్పొరేటర్ అజ్జరపు వాసు ఆధ్వర్యంలో నగరంలో ఆటోలతో నిరసన ర్యాలీ చేశారు. స్థానిక క్వారీ సెంటర్ నుంచి గోకవరం బస్టాండ్ సెంటర్ వరకూ కొనసాగింది. సుమారు 500 ఆటోలతో డ్రైవర్లు, యజమానులు, వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఎంపీ, వైఎస్సార్ సీపీ సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి మార్గాని భరత్ రామ్ ఆటో కార్మికులకు మద్దతు పలికారు. క్వారీ సెంటర్ వద్ద ఆటో కార్మికుల నిరసన ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ జగనన్న పాలనలో ఆటో కార్మికుల సంక్షేమానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారన్నారు. ఆటో కార్మికులు మాట్లాడుతూ తమ జీవనోపాధిని అడ్డుకుంటున్న టీడీపీ అధినేత చంద్రబాబు గెలవకుండా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న లక్షల మంది ఆటో కార్మికులు అడ్డుకుంటామని హెచ్చరించారు.

జగన్ పాలనలోనే అందరికీ మేలు



బొమ్మూరులో ప్రచారం చేస్తున్న చందన నాగేశ్వర్, శ్రీనివాసులురెడ్డి

రాజమహేంద్రవరం రూరల్: సంక్షేమ పథకాలు కొనసాగడంతో పాటు ప్రజలకు మంచి జరగాలంటే జగనన్నను మళ్లీ సీఎంగా చేసుకోవాలని ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్, వైఎస్సార్ సీపీ నాయకుడు, న్యాయవాది గొందేశి శ్రీనివాసులురెడ్డి అన్నారు. శుక్రవారం సాయంత్రం చెరువుగట్టు, కాపులవీధి, ముస్లింపేటలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రాబోవు ఎన్నికలలో ఎమ్మెల్యేగా చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణను, ఎంపీ డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌లను గెలిపించాలని కోరారు. చంద్రబాబు, పవన్‌ల మేనిఫెస్టో ఒక బూటకమని, అబద్ధపు హామీలతో ప్రజలను మభ్యపెట్టేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. ముద్దాల అను, ముత్యాల పోసికుమార్, సుమన్ పాల్, యెనుముల త్యాగరాజు, దాకే శ్రీనివాస్, సద్గుణరామారెడ్డి, కేవీ సుబ్బారెడ్డి, ఎలుగొండ లక్ష్మి, మత్సేటి శివ తదితరులు పాల్గొన్నారు.

సీట్ల కేటాయింపులో బీసీలకు అగ్రస్థానం



విలేకరులతో మాట్లాడుతున్న బీసీ సంఘాల జేఏసీ చైర్మన్ నాగేశ్వరరావు

రాజమహేంద్రవరం సిటీ: ఉభయ గోదావరి జిల్లాలలో అత్యధిక జనాభా ఉన్న బీసీ సామాజిక వర్గానికి సీఎం జగన్ సీట్ల కేటాయింపులో అగ్రతాంబూలం ఇవ్వడం హర్షణీయమని, ఆ అభ్యర్థులందరినీ గెలిపించుకోవడానికి ఐక్యంగా కృషి చేయాలని బీసీ జేఏసీ రాష్ట్ర చైర్మన్, వైఎస్సార్ సీపీ నాయకుడు మార్గాని నాగేశ్వరరావు, మాజీ కార్పొరేటర్, శెట్టి బలిజ సంఘం నాయకుడు వాసంశెట్టి గంగాధర్ పిలుపునిచ్చారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మార్గాని నాగేశ్వరరావు మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో 11 పార్లమెంట్, 48 అసెంబ్లీ స్థానాలలో బీసీలు పోటీచేస్తున్నారన్నారు. అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన జ్యోతిరావు పూలే అడుగుజాడల్లో నడుస్తున్న జగన్‌కు బీసీలు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. వాసంశెట్టి గంగాధర్ మాట్లాడుతూ బీసీ సామాజిక వర్గానికి చెందిన డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌కు ఎంపీ సీటు, భరత్ రామ్‌కు సిటీ, మంత్రి వేణుకు రూరల్ స్థానాలను కేటాయించడం అభినందనీయమన్నారు. మన అభ్యర్థులను గెలిపించుకోవడానికి అందరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో బీసీ నాయకులు కడియాల శ్రీనివాస్, కదలి వెంకటేశ్వరరావు, గుత్తుల మురళీధర్, పెంకే సురేష్, రేలంగి వీర వెంకట సత్యనారాయణ పాల్గొన్నారు.

కడుపు మంట చల్లారిందా బాబూ?

- అవ్వాతాతల ఆవేదన
- పింఛన్ తీసుకోవడానికి అవస్థలు
- బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు



పింఛన్ సొమ్ముల కోసం కస్టమర్ సర్వీస్ సెంటర్ వద్ద వేచి ఉన్న పింఛన్‌దారులు

సీటీఆర్ఐ: జగన్ అధికారంలోకి వచ్చాక సూర్యుడు ఉదయించకముందే పింఛన్ లబ్ధిదారుడి ఇంటికి వలంటీర్ వచ్చి పింఛన్ సొమ్మును పంపిణీ చేసేవారు. ప్రభుత్వం సంక్షేమ పథకాలన్నీ వలంటీర్ల ద్వారా అర్హుల ముంగిటకు చేరేవి. ప్రతి నెలా ఒకటో తేదీనే 90 శాతం పైగా పింఛన్లు పంపిణీ దిగ్విజయంగా జరిగేది. అవ్వాతాతలు, వృద్ధులు, వికలాంగులకు ఇబ్బంది కలగకుండా సీఎం జగన్ వలంటీర్ల ద్వారా పింఛన్‌ను పంపిణీ చేయించేవారు. ఈ వ్యవస్థపై ఆది నుంచి టీడీపీ నాయకుల అసూయ పెంచుకున్నారు. రోజు రోజుకీ వలంటీర్లు ప్రజలకు చేరువ కావడంతో తలలు పట్టుకున్నారు. చివరకు తెలుగుదేశం, జనసేన నాయకులు వలంటీర్లపై అనైతిక ఆరోపణలు చేశారు. చివరకు ఎన్నికల కోడ్ అడ్డుపెట్టుకుని వలంటీర్లను పింఛన్ పంపిణీకి దూరం చేశారు. దీంతో అవ్వతాతలు, ఇతర లబ్ధిదారులకు అవస్థలు మొదలయ్యాయి.

3వ తేదీ వచ్చినా అందని పింఛన్

ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా మే నెలలో లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలలో పింఛన్ సొమ్ము జమ చేయడంతో అది కాస్తా భారంగా మారింది. అవ్వాతాతలు బ్యాంకుల చుట్టూ తిరగలేక అవస్థలు పడుతున్నారు. ప్రతినెలా ఒకటో తేదీనే పింఛన్ అందుకునే వాళ్లందరూ ఇప్పుడు 3వ తేదీ వచ్చినా నగదు అందకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. బ్యాంకులలో రద్దీ ఎక్కువగా ఉండటంతో కమిషన్ తీసుకుని డబ్బులు ఇచ్చే సెంటర్ల వద్దకు వెళుతున్నారు. ఎందుకిలా పగ తీర్చుకుంటున్నావ్ చంద్రబాబూ.. మీకు మేము ఏం ద్రోహం చేశామని ఆవేదన చెందుతున్నారు.

పథకాలు కొనసాగాలంటే జగనే రావాలి

- వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించండి
- కడియపుసావరంలో మంత్రి వేణు ఎన్నికల ప్రచారం



కడియపుసావరంలో మాట్లాడుతున్న మంత్రి వేణు, చిత్రంతో ఎంపీ అభ్యర్థి డాక్టర్ శ్రీనివాస్ తదితరులు

కడియం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులతో రాష్ట్రం ప్రగతి బాటలో పయనిస్తోందని, పేదలు ఆర్థికాభివృద్ధి సాధించారని మంత్రి, వైఎస్సార్ సీపీ రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ అన్నారు. ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌తో కలిసి శుక్రవారం కడియపుసావరం గ్రామంలో మాజీ సర్పంచ్ సాపిరెడ్డి సూరిబాబు ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మంత్రి వేణు మాట్లాడుతూ సంక్షేమ పథకాలు కొనసాగాలంటే జగనే మళ్లీ సీఎం కావాలన్నారు. గ్రామంలోని ఇంటింటికి వెళ్లి ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలుకరించి, జగన్ ఐదేళ్ల పాలనలో అందించిన సంక్షేమ పాలన, సంక్షేమ పథకాలను వివరించారు. ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసి తమను గెలిపించి జగన్‌ను ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. అనంతరం మంత్రి వేణు మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలలో వైఎస్సార్ సీపీ గెలుపు తథ్యమన్నారు. సీఎం జగన్‌ను ఎదుర్కొనే ధైర్యం లేకనే చంద్రబాబు నాయుడు జనసేన, బీజేపీ పార్టీలతో పొత్తు పెట్టుకుని ప్రజల ముందుకు వస్తున్నారన్నారు. తాము నియోజకవర్గంలో గెలుపు కోసం ఆలోచించడం లేదని, అత్యధిక మెజార్టీయే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామన్నారు. నవరత్నాల్లాంటి సంక్షేమ పథకాలతో పేదల హృదయాల్లో జగన్ సుస్థిరస్థానం సంపాదించుకున్నారన్నారు. కార్యక్రమంలో సాపిరెడ్డి కామేష్, తోరాటి శ్రీను, యాదల సతీష్ చంద్ర స్టాలిన్, గిరిజాల బాబు, దొంతంశెట్టి వీరభద్రయ్య, భీమిరెడ్డి నాగేంద్ర, కొత్తపల్లి వెంకటేశ్వరరావు, గుత్తుల రమేష్, తోకల శ్రీను, కొండపల్లి పట్టియ్య, టేకి శ్రీను, సంగీతం వెంకటేశ్వరరావు, కొత్తపల్లి శివాజీ, తోకల వీర వెంకట్రావు పాల్గొన్నారు.

జగన్‌కే నాయీ బ్రాహ్మణుల మద్దతు



జగన్ పాలనలో జరిగిన అభివృద్ధిని వివరిస్తున్న నాయీ బ్రాహ్మణ నాయకులు

రాజమహేంద్రవరం సిటీ: నగరంలోని నాయీ బ్రాహ్మణులందరూ టీడీపీకే ఓటు వేస్తారని ఆ పార్టీలోని ఒక సంఘీయుడు చెప్పడం హాస్యాస్పదంగా ఉందని వైఎస్సార్ సీపీ నాయీ బ్రాహ్మణ నాయకులు అందనాపల్లి సత్యనారాయణ, చిట్టాబత్తుల నాగబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం జరిగిన సమావేశంలో మాట్లాడుతూ చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు నాయీ బ్రాహ్మణులను బెదిరిస్తూ మాట్లాడడం మరిచిపోలేదన్నారు. సీఎం జగన్ తమ సామాజికవర్గ అభ్యున్నతికి అనేక పథకాలు అమలు చేశారన్నారు. ఆయనకు తమ మద్దతు ఉంటుందని ప్రకటించారు. నగరంలో భరత్‌రామ్‌ను ఎమ్మెల్యేగా గెలిపించుకుంటామన్నారు. సమావేశంలో ఉప్పాడ అప్పలరాజు, పొన్నాడ గంగాధర్, చిట్టాబత్తుల రాజు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రచారం

రాజమహేంద్రవరం రూరల్: నియోజకవర్గం పరిధిలోని 27, 26 డివిజన్లలో శుక్రవారం టీడీపీ ఎమ్మెల్యే, ఆ పార్టీ అభ్యర్థి గోరంట్ల బుచ్చయ్య చౌదరి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సైకిల్ గుర్తుపై ఓటు వేయాలని కోరారు. అలాగే బొమ్మూరులోని సోమనవారితోట, మురళీకొండ ప్రాంతాల్లో కాంగ్రెస్ అభ్యర్థి బాలేపల్లి మురళీధర్ ప్రచారం నిర్వహించారు.


బీఎంపీలు, ఆర్ఎంపీల సేవలు ప్రశంసనీయం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి గూడూరి శ్రీనివాస్

కంబాలచెరువు: బీఎంపీ, ఆర్ఎంపీలు నిత్యం ప్రజలకు అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని వైఎస్సార్ సీపీ రాజమండ్రి పార్లమెంటరీ నియోజకవర్గ ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్ అన్నారు. స్థానిక రౌతు తాతాలు కళ్యాణ మండపంలో శుక్రవారం బీఎంపీల ఆత్మీయ సమావేశం జరిగింది. డాక్టర్ గూడూరి శ్రీనివాస్, రుడా చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు, ఎమ్మెల్యే అభ్యర్థి మార్గాని భరత్ రామ్‌లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. డాక్టర్ గూడూరి శ్రీనివాస్ మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలకు సామాజిక న్యాయాన్ని అందించిన జగనన్నకు మనమంతా మద్దతు తెలపాలన్నారు. త్వరలో జరిగే ఎన్నికలలో రెండు ఓట్లను ఫ్యాన్ గుర్తుపై వైఎస్సార్ సీపీ అభ్యర్థులకు అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు.

భ్రూణహత్యలపై అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ వెంకటేశ్వరరావు

రాజమహేంద్రవరం రూరల్: భ్రూణ హత్యలపై ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు అన్నారు. బొమ్మూరులో జిల్లా జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి కార్యాలయంలో శుక్రవారం యూపీహెచ్‌సీల ప్రోగ్రామ్‌లపై ఆయన సమీక్షించారు. జిల్లాలోని 15 యూపీహెచ్‌సీల పనితీరుపై సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ ఎండతీవ్రత ఎక్కువగా ఉన్నందున వడదెబ్బకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు తెలియజేయాలన్నారు. యూతఈహెచ్‌సీలలో ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ హరిప్రసాద్, సమ్మి కుమార్, సీహెచ్‌వో శర్మ, సూపర్ వైజర్ ప్రసాద్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

జగన్‌తోనే ప్రతి గడపకూ సంక్షేమం

రాజమహేంద్రవరం రూరల్: రాష్ట్రంలో గడప గడపకు సంక్షేమాన్ని అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతోందని ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్ అన్నారు. తొర్రేడులో శుక్రవారం వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఉప్పులూరి వీర వెంకట సత్యనారాయణ, జేసీఎస్ కన్వీనర్ తాటికొండ విష్ణుమూర్తి ఆధ్వర్యంలో బూత్ కమిటీ కన్వీనర్ల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించి, వైఎస్సార్ సీపీ అభ్యర్థులు గెలిచేందుకు బూత్ కమిటీ సభ్యులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో చెల్లుబోయిన నరేన్, ఆచంట కల్యాణ్, యెజ్జు వాసు, ఉప్పులూరి రాము, కొత్తపల్లి నాగేశ్వరరావు, తగరం సురేష్ బాబు పాల్గొన్నారు.